క్లుప్తంగా

ఘనంగా జలధి ఉత్సవం



రొళ్లగొల్లహట్టిలో స్వామివార్లను జలధికి తరలిస్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లగొల్లహట్టి గ్రామంలో జలధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, చిత్రలింగేశ్వరస్వామి, ఈరప్పస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మేళ తాళాలతో ఊరేగింపుగా సమీపాన రొళ్ల చెరువు వద్దకు తీసుకువెళ్లి పట్టం కూర్చోబెట్టారు. తర్వాత రొళ్ల చెరువులో నియమనిష్టలతో దేవత విగ్రహాలను గంగా జలంతో శుద్ధి చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. అనంతరం తిరిగి యథావిధిగా ఆలయంలోకి తీసువచ్చి పట్టం కూర్చోబెట్టారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి ఉన్నత, జీఎస్ పాళ్యం ప్రాథమిక పాఠశాలలతో పాటు స్థానిక మురళి ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ సోమవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాశాఖకు సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రద్ధ తీసుకుని సంబంధిత కార్యాచరణను పూర్తి చేయాలన్నారు.

108 వాహనానికి దారేదీ?



రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపిన దృశ్యం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ద్విచక్ర వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెడుతున్నారు. దీంతో నిత్యం అదే దారిగుండా ప్రభుత్వాస్పత్రికి వెళ్లే 108 వాహనం వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతోంది. అత్యవసర సమయంలో వాహనం తీసుకెళ్లాలంటే అవస్థ పడుతున్నామని 108 వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం పరిధిలో రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల: మండల కేంద్రం గుడిబండ రోడ్డులోని 33/11 కేవీఏ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆవరణలో అత్యవసర మరమ్మతు కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రొళ్ల, హులికుంట, హొట్టేబెట్ట, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకితో పాటు దొడ్డేరి పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కీంలో పనిచేస్తున్న వర్కర్లు ఈ నెల 25న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్కూల్ స్వీపర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంఈఓ గంగప్పకు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ స్వీపర్స్ 30 ఏళ్లుగా పనిచేస్తున్నా నెలకు రూ.4 వేలు ఇస్తున్నారని, ఆ జీతం కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఆరు నెలల నుంచి వారికి జీతం రాలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సరోజమ్మ, షాహీన పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రాఘవన్

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రాఘవన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, లైంగిక దాడులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కియా ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల విడిది లేక అవస్థలు

- లేపాక్షిలో దుకాణాల వద్దే పర్యాటకులు, ప్రయాణికుల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



లేపాక్షి పాత బస్టాండులో బస్సు షెల్టర్ లేక ఇలా..



దుకాణాల వద్ద వేచి ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు

లేపాక్షి: పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన లేపాక్షి బస్టాండులో ప్రయాణికుల విడిది లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల్లోనే అటు పర్యాటకులు, ఇటు ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. లేపాక్షి పర్యాటక కేంద్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది పర్యాటకులు, భక్తులు లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తుంటారు. అయితే బస్సులు లేదా ఇతర వాహనాల ద్వారా విచ్చేసిన పర్యాటకులు బస్టాండుకు చేరుకుంటుంటారు. కొన్నేళ్లుగా పాత బస్టాండ్‌లోనే ప్రయాణికులు వేచి ఉంటుంటారు. ప్రయాణికులు, పర్యాటకులు ఆలయంతో పాటు జటాయువు ఘాట్, జటాయువు పక్షి, నంది విగ్రహం, థీం పార్కులను సందర్శిస్తారు. తిరిగి ప్రయాణం చేయడానికి బస్టాండుకు వెళితే నిల్చోడానికి నీడ లేకపోవడంతో దుకాణాలు వద్ద, ఇతర షాపుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో బస్టాండులో నీడనిచ్చే పెద్ద వృక్షాలు ఉండేవి. వచ్చిపోయే ప్రయాణికులు అక్కడ విశ్రాంతి తీసుకునే వారు. కొడికొండ చెక్ పోస్టు నుంచి శిరా వరకు జాతీయ రహదారి కావడంతో రోడ్డు వెడల్పులో భాగంగా బస్టాండులో ఉన్న చెట్లు, అరుగును తొలగించారు. జాతీయ రహదారి ఏర్పాటు చేయడం వలన రద్దీ పెరిగి ప్రమాదాలు జరగడం, ట్రాఫిక్ పెరగడంతో జాతీయ రహదారిని గ్రామం చివరిలో వేయాలని స్థానికులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఈ రహదారిని గ్రామానికి బయట వేసింది. అప్పటికే బస్ షెల్టర్‌కు స్థలం వదిలినా ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో అటు ప్రయాణికులు, ఇటు పర్యాటకులకు బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా దుకాణాలు ముందు ప్రయాణికులు కూర్చుంటే తమ వ్యాపారాలకు అడ్డుగా ఉంటుందంటూ కొందరు వ్యాపారులు కూర్చునే చోట ఏవైనా పరికరాలు ఉంచుతుండటంతో ప్రయాణికులు నిల్చొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఖాళీ స్థలం ఉన్నచోట ఆటోలు, ఇతర వాహనాలు నిలబెడుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి లేపాక్షి బస్టాండులో ప్రయాణికులు వేచి ఉండడానికి బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి



లేపాక్షిలోని వీరభద్ర ఆలయాన్ని చూసేందుకు ఎంతో మంది సుదూర ప్రాంతాల నుంచి లేపాక్షికి విచ్చేస్తున్నారు. ఆలయాన్ని సందర్శించడానికి ముందు, సందర్శించిన తరువాత బస్టాండుకు వచ్చినప్పుడు నిలుచుకోవడానికి లేదా సేదతీర్చుకోవడానికి విడిది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు స్పందించి బస్టాండులో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

–కదిరప్ప, ప్రయాణికుడు, ఊటూకూరు

ఆధునిక సామాజిక తత్వవేత్త కనకదాస



హిందూపురం: కనకదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: సమాజంలోని కులవ్యవస్థకు వ్యతిరేకంగా తన గానంతో జాగృతం చేసిన ఆధునిక సామాజిక తత్వవేత్త భక్త కనకదాస అని పలువురు వక్తలు కొనియాడారు. కనకదాస జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బలరామిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, వైఎస్సార్ సీపీ నాయకులు మహేష్‌గౌడ్, కౌన్సిలర్ రామచంద్ర, పట్టణ కన్వీనర్ మన్సూర్, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పావగడ: భక్త కనక దాస జయంతి వేడుకలు సోమవారం పావగడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో తహసీల్దార్ వరదరాజు పాల్గొని కనకదాసు చిత్ర పటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. తుమకూరు రోడ్డు లోని కనకదాసు విగ్రహానికి ఎమ్మెల్యే వెంకటేశ్ పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కురుబ కులస్తులు కనకదాసు చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కురుబ కులస్తులు, పలు రాజకీయ పార్టీల నాయకులు మిట్టాంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అగళి: మండల పరిధిలోని గ్యారగోండనహళ్లిలో సోమవారం కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనకగాస చిత్రపటానికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌తో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతలు ఎప్పుడో?

- ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు
- 10 రోజులు గడిచినా బలరామిరెడ్డికి బాధ్యతలు అప్పగించని వైనం


GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (G) DEPARTMENT

S.ANANTHA RAMU
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT(FAC)

మున్సిపల్ డీఎంఏ నుంచి విడుదలైన ఉత్తర్వులు

హిందూపురం: హిందూపురం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బలరామిరెడ్డిని నియమిస్తూ ఈనెల 8వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఉత్తర్వులు జారీ చేసి వారం రోజులు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు ఇంత వరకూ ఆయనకు బాధ్యతలు అప్పజెప్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎవరి ఒత్తిళ్లతో తలొగ్గి అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయడం లేదో అంతుబట్టడం లేదు. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ పదవిని దక్కించుకోవడానికి టీడీపీ నాయకులు క్యాంపు రాజకీయాలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పీఠం కోసం నోటిఫికేషన్ వచ్చే వరకూ ఇన్‌చార్జ్ ఛైర్మన్‌గా బలరామిరెడ్డి వ్యవహరించేలా ఉత్తర్వులిచ్చారు. దీంతో టీడీపీ నాయకులు చేసేది లేక క్యాంపునకు తరలించిన కౌన్సిలర్లందరినీ హిందూపురానికి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే కుమార్తె వివాహమంటూ మున్సిపల్ కమిషనర్ సెలవుపై వెళ్లారు. ఆయన వచ్చిన తర్వాతే ఇన్‌చార్జ్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగిస్తారని ఇన్‌చార్జ్ అధికారి చెబుతున్నారు. అయితే కమిషనర్ సోమవారం విధులకు వచ్చినా ఇన్‌చార్జ్ ఛైర్మన్‌కు బాధ్యతలు అప్పగించకపోవడం చర్చనీయాంశమైంది. ఇన్‌చార్జ్ ఛైర్మన్ వ్యవహారంపై తనకు ఇంత వరకూ సమాచారం ఇవ్వలేదని బలరామిరెడ్డి చెబుతున్నారు.

అంగన్‌వాడీలకు మూడు నెలల అద్దె చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ సెంటర్లకు మూడు నెలల అద్దెను విడుదల చేశారు. హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ అద్దె భవనాలకు 8 నెలలుగా అద్దెలు అందకపోవడంతో 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 14న ''అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు'' అనే కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 184 అంగన్‌వాడీ అద్దె కేంద్రాలకు మూడు నెలల అద్దెలను సోమవారం చెల్లించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తకాలను ప్రదర్శించినట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మడకశిర/గోరంట్ల/లేపాక్షి: ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే సోమవారం మడకశిర, గోరంట తహసీల్దార్ కార్యాలయాల ముందు నిరసన తెలిపారు. మడకశిరలో సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర, కన్యకాకుమారి, గోరంట్లలో వ్య.కా.సం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. లేపాక్షిలో గ్రామ కార్యదర్శి రమేష్‌కు సీపీఐ నాయకులు శివప్ప, నారాయణరెడ్డి, గౌతమ్ తదితరులు వినతిపత్రమిచ్చారు.

మొరాయిస్తున్న సర్వర్

లేపాక్షి: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో అపార్ సేవలకు అంతరాయం కలిగింది. సోమవారం సర్వర్ మొరాయించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అపార్ ఐడీ కోసం సోమవారం మండల వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు వచ్చారు. ఆధార్, పుట్టిన తేదీ, విద్యార్థి పేరు, ఇంటి పేరులో మార్పులు చేసుకోవడం వచ్చిన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే ఇప్పటి వరకు 70 శాతం అపార్ నమోదు అయిందని ఎంఈఓ నాగరాజు తెలిపారు.

పట్టాలు మంజూరు చేయండి

పెనుకొండ రూరల్: పట్టణ పరిధిలోని గోనిపేట రహదారిలో సర్వే నంబర్ 272లో కొన్నేళ్లుగా వంద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నా నేటికీ పట్టాలు ఇవ్వలేదని కృష్ణదేవరాయల కాలనీ వాసులు తెలిపారు. వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు శ్రీరాములు, మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

సంక్షిప్త సమాచారం

14 ఫిర్యాదులు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై 14 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

క్రీడాపరికరాలు అందజేత

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు, పరికరాలను క్లాత్ ఫర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. చల్లాపల్లికి చెందిన నవీన్‌రెడ్డి అమెరికాలో స్థిరపడగా.. ఆయన తనయుడు నథన్‌రెడ్డి, మిత్రుడు శిరీష్ గోయల్‌లు కలిసి సంస్థ ద్వారా 9, 10 వ తరగతి విద్యార్థులకు ఉచితంగా క్రీడాపరికరాలు అందించారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. బియ్యం సరిగా లేదని, అన్నం మొత్తం ముద్దగా అవుతోందన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

అమరాపురం: గ్రామాల్లో ప్రజలు దైవ కార్యాలు చేయడం ద్వారా ప్రజలు సుభిక్షంగా ఉంటారని కర్ణాటక రాష్ట్రం యలే రాంపురం పీఠాధిపతి హనుమంతనాథ స్వామిజీ అన్నారు. సోమవారం మండలంలోని ఆలదపల్లిలో గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో సుందరమైన దేవాలయాన్ని నిర్మించారు. సోమవారం శనీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

లేపాక్షి: మండల పరిధిలోని ఎస్ఎస్ఆర్ జెడ్పీ పాఠశాలలో 19 నుంచి 22వ తేదీ వరకూ ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా వున్న ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ అయ్యేలా చూడాలన్నారు.

కొనసాగుతున్న కన్నడ జ్యోతి రథయాత్ర

పావగడ: మండ్యలో జరిగే కన్నడ సాహిత్య సమ్మేళనం సందర్భంగా పట్టణానికి చేరుకున్న కన్నడ జ్యోతి రథయాత్రను తహసీల్దార్ వరదరాజు అతిథి గృహం వద్ద సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థిని విద్యార్థులు రథ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం తుమకూరు రోడ్డు ద్వారా రథయాత్ర మధుగిరి మార్గం వైపు కొనసాగింది.



రత్నగిరి కాళికాంబ కామటేశ్వరస్వామి ఆలయంలో జ్యోతులు వెలిగిస్తున్న భక్తులు



తమ్మడేపల్లిలో అలంకరణలో చిత్రలింగేశ్వరస్వామి



హిందూపురం పరిధిలోని మేళాపురం శివాలయంలో..

కార్తీక శోభ

సాక్షిబృందం: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కొన్ని ఆలయాల్లో లక్ష దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అమరాపురం మండలం ఆలదపల్లిలో పూర్ణకుంభాలతో భక్తులు



రొళ్ల : అలంకరణలో పాతలింగేశ్వరస్వామి



హిందూపురంలోని త్యాగరాజునగర్‌లో...



గుడిబండ: భోజబండేశ్వరస్వామి



హిందూపురంలో ...

ఎమ్మెల్యే గంగ పూజ

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామంలో ఉత్తర పినాకిని నదికి ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సోమవారం గంగ పూజ చేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి వెంకటరమణప్ప ఉత్తర పినాకిని నదిని దర్శించుకుని పెన్నమ్మకు గంగ పూజ చేశారు.

గ్రామ సచివాలయం పరిశీలన

గుడిబండ: మండల పరిధిలోని దేవరహట్టి సచివాలయాన్ని ఎంపీడీఓ గంగాధర్ సోమవారం పరిశీలించారు. ముందుగా ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

సందడిగా వన భోజనాలు



వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

పెనుకొండ: పట్టణంలో సోమవారం ఆర్యవైశ్యులు వన భోజనాల కార్యక్రమం సందడిగా జరిగింది. స్థానిక చెరువుగేరిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య కుటుంబాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహించి ఆనందంగా గడిపారు. కార్తీక మాసంలో ప్రతి ఏడాది వనభోజనాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య కుల పెద్దలు సుధాకర్ గుప్తా, నాగరాజు తెలిపారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలి

సోమందేపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భూ పోరాట ఇళ్ల స్థలాల సాధన కమిటీ నాయకులు నూర్జహాన్, అంజినమ్మ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రొద్దం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీటీచ్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించినట్లు రొద్దం గ్రంథాలయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం పావగడ తాలుకాలోని లింగదహళ్లికి చెందిన నాగరాజుశెట్టి దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు. వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు అందించారు.

భక్తిశ్రద్ధలతో పదహారు సోమవారాల వ్రతం



అమరాపురంలో వ్రతం చేస్తున్న మహిళా భక్తులు

అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదహారు సోమవారాల వ్రతాన్ని మహిళలు సోమవారం ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళా భక్తులు ఉపవాస దీక్షలతో శివుని ప్రతిమ వద్ద అర్చకులు నరసింహభట్టాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

రొద్దం: అవకాశాలు అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆర్డీటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ ,తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ రామ్‌కుమార్, ప్రభుత్వ వైద్యుడు సోమశేఖర్‌రెడ్డి, పీడీపీఓ శాంతలక్ష్మి, ఎస్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.